క్లుప్తంగా

నాగాభరణం బహూకరణ



స్వామివారికి నాగాభరణం అలంకరిస్తున్న దాతలు

పాలకొండ రూరల్: మండలంలోని పెద్దకోటి పల్లి గ్రామంలో కొలువైన విశ్వేశ్వరస్వామి ఆలయానికి పాలకొండ పట్టణంకు చెందిన న్యాయవాది ఏనుగుతల లక్ష్మణనాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయిని కృష్ణవేణి దంపతులు వెండి ఆభరణాలు, నాగభరణం వితరణ చేశారు. రూ.2 లక్షల విలువైన వెండి ఆభరణాలను సోమవారం ఆలయ అర్చకులు సత్యకుమార్‌కు అందజేశారు. పర్వదినాల్లో స్వామివారికి ఆ వస్తులను అలంకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన రొక్కం నరసింహారావు(84) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే కళావతి సోమవారం పరామర్శించారు. నరసింహారావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె వెంట కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేడిబోయిన శ్రీవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం రామారావు, మేడిబోయిన చలపతి, తదితరులున్నారు.

పిచ్చికుక్క దాడిలో మహిళకు గాయాలు

జియ్యమ్మవలస: పిచ్చికుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నిమ్మలపాడు గ్రామానికి చెందిన గలావిల్లి పార్వతి (30) సోమవారం ఉద యం ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న పిచ్చికుక్క ఒక్కసారిగా తనపై దాడి చేసి గాయపరిచింది. చేతిపై, తలపై గాయాలు కావడంతో స్థానికులు చినమేరంగి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల కిందట బిత్రపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కూడా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు.

పీఏసీఎస్ సిబ్బంది వినతి

గరుగుబిల్లి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావుకు పీఏసీఎస్ జిల్లా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.సత్యంనాయుడు, పలువురు ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 94 సహకార సంఘాల్లో సుమారు 300 మందివరకు ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. పలువురు ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. డీసీసీబీల మాదిరిగానే పీఏసీఎస్‌లను కంప్యూటరైజేషన్ చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశల వారీ పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈఓ ఎన్.గుంపస్వామి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను తహసీల్దార్ జయప్రకాష్ సోమవారం తనిఖీ చేశారు. మాల్‌ప్రాక్టీసుకు తావులేకుండా పక్కాగా పరీక్షలు నిర్వహించాలని ప్రిన్సిపాల్ మాచర్ల కుమారస్వామికి సూచించారు. మోనటరింగ్ రూంలో ఏర్పాటు చేసిన సిస్టమ్‌లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

ఉపాధి సిబ్బంది వినతి

గరుగుబిల్లి: ఎన్ఆర్ఈజీఎస్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ పి.సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్నామన్నారు. వేతనాలు పెంచాలని, 23 శాతం పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.శంకరరావు, డి.శ్రీనివాసరావు, కె.నిర్మల, ఎం.హరికృష్ణ, ఉమామహేశ్వరరావు, భూలక్ష్మి తదితరులున్నారు.

పొర్జాపైడిలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సీతంపేట: తమను గిరిజన జాబితాలో చేర్చాలంటూ పొర్జాపైడి కులస్తులు ఐటీడీఏ ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. ముందుగా సీతంపేట నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకుడు గేదెల చిరంజీవులు మాట్లాడుతూ.. 1950 రాజ్యాంగంలో ఉన్న షెడ్యూల్ తెగలను యాదావిధిగా అమలు చేయాలన్నారు. పొర్జా ప్రధాన తెగలో ఉన్న పైడి ఉప తెగను గిరిజనులుగా గుర్తించి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలు పొర్జాపైడి కులస్తులకు వర్తింపజేయాలని, విద్య, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారికి అందజేశారు. పొర్జాపైడి సంఘ నాయకులు జీవన్‌కుమార్, సోమేషు, సురాపాణి, రాజారావు, జి.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

మండలో అభివృద్ధి వెలుగులు

- కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల కల్పన
- సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ ఇంటికి లబ్ధి
- ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణల ఫలితంగా గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా బలోపేతమయ్యారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని మండ గ్రామ సచివాలయం పరిధిలో సుమారు రూ.1.20 కోట్లతో సీసీరోడ్లు, కాలువలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు నిర్మించారు. సచివాలయం పరిధిలోని మండ, మల్లుగూడ, టిక్కబాయి, సింగారంపేట గ్రామాల్లో అర్హులైన 1,491 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.4,86,82,044లు(ప్రత్యక్ష నగదు బదిలీ), పరోక్ష నగదు బదిలీ(నాన్ డీబీటీ) ద్వారా రూ.1,55,06,911లు కలిపి మొత్తం రూ.6,41,88,955లు లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫార్సులు లేకుండా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరుతుండడంతో ప్రజలంతా చాలా సంతోషంగా ఉన్నారు.



రూ.42 లక్షలతో మండ గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం



మండ గ్రామంలో సుందరంగా తీర్చిదిద్దిన ఎంపీపీ స్కూల్



టిక్కబాయి గ్రామానికి నిర్మించిన కల్వర్టు, సీసీ రోడ్డు, కాలువ



రూ.21 లక్షలతో మండ గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

నేరుగా పథకాలు అందుతున్నాయి



ఈ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750లు, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏటా రూ.4,500లు, రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,750లు చొప్పున్న అందాయి. అంతే కాకుండా అమ్మ ఒడి పథకం రూ.15,000 చొప్పున్న మూడేళ్లు లభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు నేరుగా అందుతున్నాయి. గతంలో ఏదన్నా కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు లేవు.

– పువ్వల దమయంతి, మండ గ్రామం

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం
- రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం
- జీజీఎంపీ నిధులు రూ.40 లక్షలతో మండలో మినీ రక్షిత మంచినీటి పథకం, సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటు
- టిక్కబాయి గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టు నిర్మాణం
- మల్లుగూడ గ్రామంలో డ్రైనేజీల నిర్మాణం
- నాడు–నేడు నిధులు రూ.20.8 లక్షలతో మండ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి

సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	నగదు లబ్ధి
ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా...		
జగనన్న అమ్మ ఒడి	133	రూ.5,60,4,667
జగనన్న విద్యా దీవెన	76	రూ.1,51,1,067
జగనన్న వసతి దీవెన	46	రూ.6,97,100
వైఎస్సార్ రైతు భరోసా	225	రూ.1,08,23,850
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1	రూ.9,065
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	4	రూ.7,151
వైఎస్సార్ పెన్షన్ కానుక	189	రూ.1,89,87,000
వైఎస్సార్ చేయూత	111	రూ.51,56,250
వైఎస్సార్ ఆసరా	206	రూ.41,21,108
వైఎస్సార్ సున్నా వడ్డీ(ఎస్‌హెచ్‌జీలు)	247	రూ.2,05,189
వైఎస్సార్ కాపునేస్తం	1	రూ.60,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	31	రూ.6,05,068
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	27	రూ.1,24,300
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు)	15	రూ.1,80,680
వైఎస్సార్ బీమా	3	రూ.1,60,000
వైఎస్సార్ వాహన మిత్ర	5	రూ.1,40,000
జగనన్న చేదోడు	2	రూ.20,000
వైట్ కార్డు హోల్డర్లకు కోవిడ్ సహాయం	252	రూ.2,52,000
జగనన్న తోడు(వడ్డీ)	28	రూ.17,549
పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) ద్వారా..		
ఇంటి స్థలాలు (భూసేకరణ, అభివృద్ధికి చెల్లించిన పరిహారం)	32	రూ.78,72,000
జగనన్న విద్యా కానుక	128	రూ.9,09,056
8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు	16	రూ.2,11,552
జగనన్న తోడు (రుణాలు)	59	రూ.10,98,521
జగనన్న గోరుముద్ద	82	రూ.8,12,374
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	86	రూ.16,10,780
ఇంటింటికి రేషన్ (79.80 లక్షల మిలియన్ టన్నులు)	137	రూ.29,92,628

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం



పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

- ఇళ్ల స్థల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కళావతి

భామిని: పేదల సంక్షేమం, సామాజిక సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామినిలో సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద మండలంలోని 8 పంచాయతీల పరిధిలో సుమారు రూ.2 కోట్ల విలువైన భూములు సేకరించి 305 మంది పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పారు. నవరత్నాల పేరుతో 132 సంక్షేమ పథకాలను పేదలకు అందజేశారన్నారు. పట్టాల పంపిణీ అనంతరం రెవెన్యూ అధికారులు లబ్ధిదారులతో ఈకేవైసీ పూర్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.సింహాచలం, టింగ అన్నాజీరావు, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ జి.రమేష్, ఎంపీటీసీలు పి.ఉషారాణి, బి.తులసీ, బి.బాలకృష్ణ, తహసీల్దార్ కె.ప్రసాదరావు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, డీటీ నిమ్మల శేఖరం, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్వోలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పెంచండి..

ఉపాధి వేతనదారులకు పనిదినాలు పెంచాలని ఎమ్మెల్యే కళావతి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డుల మంజూరుకు కొందరు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని సూచించారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

పాలకొండ: సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని 1,2, 20వ వార్డుల పరిధిలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టిమఠం కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పార్టీ నాయకులు కోరాడ సూర్యానారాయణబాబు, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణకుమార్, పల్లా భాను, తూముల లక్ష్మణరావు, కొరికాన గంగునాయుడు, కోరాడ రవి, నీలాపు శ్రీనివాసరావు, యందవ మరియదాస్, బొమ్మాళి భాను, కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనీల్‌కుమార్, రణస్థలం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



గురండి వద్ద రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: గ్రామీణ రోడ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గురండి నుంచి నేరడి–బి వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె భూమి పూజ చేసి ప్రారంభించారు. గ్రామీణ రహదారులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు చెప్పారు. బిచ్చుమానుగూడ నుంచి జియ్యమానుగూడ వరకు రూ.1.50 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. లివిరి, తాలాడ బీటీరోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఏబీరోడ్డు పనులు కొనసాగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఈ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, సర్పంచ్‌లు జామి భైరాగి, కొండగొర్రి సబిత, నిమ్మల కేశవ, పార్టీ నాయకులు సరిసాభద్ర బాలయ్య, కొండగొర్రి తమ్మారావు, అర్లి రాజశేఖర్, కీర్తి నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

- పాలకొండ డివిజన్‌లో 31 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- హాజరుకానున్న 5048 మంది విద్యార్థులు

వీరఘట్టం: ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పద్రి కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పాలకొండ డివిజన్‌లోని వీరఘట్టం, సీతంపేట, పాలకొండ, భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో 103 ఉన్నత పాఠశాలలకు చెందిన 5,048 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వారిలో 4820 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 228 మంది సప్లమెంటరీ విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. 31 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. అందులో ఎ–సెంటర్లు 7, బి–సెంటర్లు 11, సీ–సెంటర్లుగా 13 కేంద్రాలను గుర్తించామన్నారు. గతేడాది పదోతరగతి ఫలితాల్లో 98.5 శాతం ఉత్తీర్ణత సాధించామని, ఈ ఏడాది శతశాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నట్లు వివరించారు. ప్రతీ రోజు స్లిప్ టెస్టులు, వీక్లీ గ్రాండ్ టెస్టులు, ప్రతీ రోజు ఉదయం సాయంత్రం వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ విద్యార్థి ఆత్మస్థైర్యంలో పరీక్షలు రాసేలా వారిని సంసిద్ధులను చేస్తున్నామన్నారు.

పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు

మండలం	రెగ్యులర్ విద్యార్థులు	సప్లమెంటరీ విద్యార్థులు	మొత్తం
గుమ్మలక్ష్మీపురం	779	04	783
సీతంపేట	981	27	1008
కురుపాం	652	18	670
జియ్యమ్మవలస	415	05	420
భామిని	474	46	520
పాలకొండ	786	84	810
వీరఘట్టం	733	44	777
	4820	228	5048

బోర్ల మరమ్మతులకు 'క్రాస్ ప్రోగ్రాం'

గరుగుబిల్లి: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా పాడైన తాగునీటి బోరుల మరమ్మతులకు ఈ నెల 6 నుంచి క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌరీశంకరరావు సోమవారం తెలిపారు. 6న మరుపెంట, టీఆర్ఎన్‌వలస గ్రామాల్లో, 7న సాంబన్నవలస, గొల్లవానివలస, 11న గరుగుబిల్లి, 12న హిక్కింవలస, 13న శివ్వాం, సీమలవానివలస, 14న పెద్దూరు, 15న బీవీపురం, 16న గొట్టివలస, 18, 19న రావుపల్లి, 20న కొత్తూరు, 21న కొత్తపల్లి, 22న ఉల్లిభద్ర, 23న లఖనాపురం, 26న కొంకడివరం, సీతారాంపురం, 27న సంతోషపురం, ఖడ్గవలస, పిట్టలమెట్ట, 28న వల్లరగుడబ, 30న సుంకి గ్రామాలలో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే ఏప్రిల్ 1న చినగుడబ, ఏప్రిల్ 2, 3న రావివలస గ్రామంలో, 4న దళాయివలస, 6న నాగూరు, 8న చిలకాం, దత్తివలస, కారివలస, 10న పెదగుడబ, ఎస్ఆర్‌పేట, 12న గిజబ, 15న ఉద్దవోలు, 16న తోటపల్లి, 18న ఆర్దీవలస గ్రామాలలో క్రాస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతులమీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు.

- కురుపాం: కురుపాంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను శనివారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతులమీదుగా స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

సచివాలయాల్లో 'స్పందన' తప్పనిసరి

వీరఘట్టం: గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం చక్కని వేదిక అన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

అప్రమత్తంగా పనిచేయాలి

పాలకొండ: ఎన్నికలు సమీపిస్తున్నందున సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని తహసీల్దార్ వరహాలు సూచించారు. మండలంలోని వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చోరీలపై అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: గ్రామాల్లో అపరిచితుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించారు. వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తుల సంచారంపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆయనతో పాటు సిబ్బంది ఈశ్వరరావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పల్స్‌పోలియో లక్ష్యాలు పూర్తిచేయాలి

- డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలైన్స్ అధికారి డాక్టర్ జాన్



పాలకొండ రూరల్: వెలగవాడలో పల్స్‌పోలియో నిర్వహణపై ఆరా తీస్తున్న సర్వేలైన్స్ అధికారి జాన్

పాలకొండ రూరల్: పల్స్‌పోలియో లక్ష్యాలను కచ్చితంగా చేరుకోవాలని, 0–5 ఏళ్లలోపు వయసున్న ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలైన్స్ అధికారి డాక్టర్ జాన్ అన్నారు. మండలంలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల పరిధిలోని వెలగవాడ, సిరికొండ, పరుశరాంపురం, అన్నవరం తదితర గ్రామాల్లో సోమవారం క్షేత్ర పరిశీలన చేశారు. పలువురి ఇళ్లకు వెళ్లి తమ పిల్లలకు పోలియో డ్రాప్స్ వేయించారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇటుకల బట్టీల్లో పనిచేస్తున్న, గ్రామ శివారులో గుడారాల్లో ఉంటున్న వలసదారుల పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ జగదీష్‌కుమార్, సీహెచ్‌ఓ జగదీశ్వరి తదితరులున్నారు.

- గరుగుబిల్లి: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో డ్రాప్స్ వేయించాలని డీఐఓ నారాయణ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో సోమవారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక వైద్యాధికారి సంతోష్‌కుమార్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారా లేదా అని తల్లిదండ్రుల వద్ద ఆరా తీశారు. పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని అన్నారు. వారి వెంట సూపర్‌వైజర్ జయగౌడ్, ఉదయకుమారి, వైద్యసిబ్బంది అనిత, మాలతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలపై శిక్షణ

వీరఘట్టం: ఎన్నికల నిబంధనలపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఈనెల 6న సీతంపేట ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జయప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి పాలకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, విక్రాంత్, తదితరులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పాలకొండ పట్టణంలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయానికి రూ.40 లక్షలతో నిర్మించిన ప్రధాన రహదారిని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్న ఈ రహదారి నిర్మాణం పూర్తి చేశామన్నారు. మరో రూ.30 లక్షలతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పట్టణంలో ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అని ప్రశ్నించారు. పాలకొండకు రింగ్ రోడ్డు మాదిరిగా ఉన్న ఈ రహదారి నిర్మాణం తమకు ఆనందం కలిగించిందన్నారు. వారితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పాలకొండ రూరల్: ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న డ్వామా, ఉపాధిహామీ సిబ్బంది

పాలకొండ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామీణాభివృద్ధి శాఖ(డ్వామా) సిబ్బంది కోరారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం ఎంపీడీఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి 23 శాతం పీఆర్‌సీ అమలు చేయాలని, డ్వామా, ఉపాధిహామీ పథకాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గ్రేడ్లు అమలుచేయాలని, మూడేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సర్వీసుతో కూడిన ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు కె.ప్రసాద్, పి.అప్పలరాజు, రోజారమణి, కంప్యూటర్ ఆపరేటర్లు కె.లక్ష్మి, సంధ్యారాణి తదితరులున్నారు.

కురుపాం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఎంపీడీఓ అప్పారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, జీతాలు పెంచాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియజేశారు.